ప్రజాశక్తి

మంగళవారం 13 మే 2025

5

పార్వతీపురం మన్యం

14న పనుకువలస ఎంఎస్ఎంఇ పార్కుకు శంకుస్థాపన

ప్రజాశక్తి - పార్వతీపురం

పాలకొండ నియోజక వర్గంలో పనుకువలస వద్ద ఎంఎస్ఎంఇ పార్కుకు శంకుస్థాపన జరుగుతుందని ఎపిఐఐసి జోనల్ మేనేజర్ ఎం.మురళీమోహన్ తెలిపారు. ఈ మేరకు సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్ర ఎంఎస్ఎంఇ, సెర్ప్, ఎన్ ఆర్ ఐ సాధికారిత వ్యవహారాల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ ఈనెల 14న ఉదయం 10 గంటలకు శంకుస్థాపన చేస్తారని ఆయన తెలిపారు. మొదటి దశలో 27.26 ఎకరాలను అభివృద్ధి జరుగుతుందన్నారు. ఈ ప్రాజెక్టుకు రూ.11.39 కోట్లు ఖర్చు జరుగుతుందని ఆయన వివరించారు.

అంగన్వాడీ పోస్టును అమ్మేశారు

వితంతువుకు అన్యాయం చేశారు

చోద్యం చూస్తోన్న జిల్లా ఉన్నతాధికారులు

ప్రజాశక్తి - పార్వతీపురం

కొద్ది నెలల క్రితం భర్తీ చేసిన అంగన్వాడీ పోస్టుల ఎంపికలో అధికారులు నిబంధనలకు తూట్లు పొడిచారు. ఈ ఎంపికలో ఒక వితంతువుకు తీరని అన్యాయం జరిగింది. అధికార పార్టీ నాయకుల సిఫార్సు మేరకు అధికారులు ఆ పోస్టును రూ.మూడు లక్షలకు అమ్మేసినట్లు బాధిత మహిళ జిల్లా కలెక్టర్ శ్యాంప్రసాద్‌కు ఫిర్యాదు చేసింది. తనకు న్యాయం చేయాలని ఆమె జిల్లా కలెక్టర్ కార్యాలయం చుట్టూ తిరుగుతున్న విషయం వెలుగులోకి వచ్చింది.

మండలంలోని బాలగుడబలో అంగన్వాడీ హెల్పర్ పోస్ట్‌కు కొద్ది నెలల క్రితం ఇంటర్వ్యూ నిర్వహించారు. ఈ పోస్టుకు గ్రామానికి చెందిన వితంతు మహిళ కింతలి ఉషారాణి దరఖాస్తు చేసుకున్నారు. ఆమె భర్త మరణించడంతో కుటుంబం దిక్కుతోచని స్థితిలోకి వెళ్లింది. పైగా ఆమెకు ఇద్దరు పిల్లలు ఉన్నారు. వారిలో ఒక కుమారుడు వికలాంగుడు కూడా. ఇలాంటి పరిస్థితుల్లో ఆమె అంగన్వాడీ హెల్పర్ పోస్ట్‌పై గంపెడాశలు పెట్టుకున్నారు. నిబంధనల ప్రకారం అంగన్వాడీ పోస్టుల ఎంపికలో వితంతు మహిళలకు మొదటి ప్రాధాన్యత ఇవ్వాలి. కానీ అధికారులు కళ్లు మూసుకుని ఎంపిక చేశారో, సెలెక్షన్ కమిటీ ఎంపిక చేసిన జాబితాని తారుమారు చేశారో తెలియదు కానీ ఉషారాణి ఎంపిక కాలేదు. గ్రామ టిడిపి నాయకులు సిఫార్సు చేసిన మరో మహిళకు హెల్పర్ పోస్ట్‌ను కట్టబెట్టారు. జరిగిన అన్యాయాన్ని తట్టుకోలేక వితంతు మహిళ ఉషారాణి వెంటనే జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. అన్ని అర్హతలు కలిగిన తనకు ఇవ్వకుండా అధికారపార్టీ నాయకుల సిఫార్సు మేరకు లక్షలు లంచమిచ్చిన మహిళను ఎంపిక చేశారని ఉషారాణి తన ఫిర్యాదులో పేర్కొన్నారు. మొదటిసారి ఇచ్చిన ఫిర్యాదుపై జిల్లా కలెక్టర్ స్పందించకపోవడంతో ఆమె సోమవారం మళ్లీ తన వికలాంగుడైన కుమారుడితో గ్రీవెన్స్ సెల్‌కు వచ్చి మరోసారి ఫిర్యాదు చేశారు. తనకు న్యాయం చేయాలని, తన కుటుంబ పోషణకు ఎలాంటి ఆధారం లేదని ఆమె చెప్పారు. ఆమెకు

కలెక్టర్‌కు ఫిర్యాదుచేసేందుకు తన వికలాంగు కుమారుడితో వచ్చిన బాధితురాలు ఉషారాణి

న్యాయం చేయాలని బాలగుడబకు చెందిన కొంతమంది మహిళలు కూడా కలెక్టర్‌ను కలిశారు. అయినా జిల్లా కలెక్టర్ శ్యాం ప్రసాద్ ఏ విధమైన హామీ ఇవ్వలేదు. జరిగిన తప్పును సరిదిద్ది న్యాయం చేస్తానని కలెక్టర్ భరోసా ఇవ్వలేకపోయారు. దీంతో ఆమె నిరాశతో వెనుదిరిగారు. తనకింద స్థాయి అధికారులు అంగన్వాడీ పోస్టుల భర్తీలో నిబంధనలను ఉల్లంఘించి ఎంపిక చేసినా కలెక్టర్ సరిదిద్దలేకపోవడం చర్చనీయాంశమవుతోంది. పైగా బాధిత వితంతు మహిళ ఉషారాణి ఫిర్యాదు చేయడంపై ఐసిడిఎస్ అధికారులు ఆమెను బెదిరిస్తున్నారనే వాదనలు వినిపిస్తున్నాయి. రూ.3లక్షలకు హెల్పర్ పోస్ట్‌ను అమ్మేశారని ఆమె చేసిన ఫిర్యాదును వెనక్కి తీసుకోవాలని ఓ ఐసిడిఎస్ అధికారి ఆమె ఇంటికి వెళ్లి బెదిరించడం వివాదాస్పద మవుతోంది.

పాఠశాలల పున: వ్యవస్థీకరణ, బదిలీలు, ప్రమోషన్ల సమస్యల పరిష్కారానికి

గొడుగులతో యుటిఎఫ్ నిరసన

ప్రజాశక్తి - పార్వతీపురం

పాఠశాలల పున: వ్యవస్థీకరణ, బదిలీలు, ప్రమోషన్లకు సంబంధించిన సమస్యల పరిష్కారం కోరుతూ పాఠశాల విద్యాశాఖ అనుసరి స్తున్న వైఖరికి నిరసనగా యుటిఎఫ్ జిల్లా శాఖ ఆధ్వర్యాన ఉపాధ్యాయులు గొడుగులు పట్టుకొని స్థానిక జిల్లా విద్యాశాఖ అధికారి కార్యాలయం ఎదుట సోమవారం నిరసన చేపట్టారు. ప్రభుత్వ విద్యారంగాన్ని కాపాడాల్సిన ప్రభుత్వం దాన్ని నిర్వీర్యం చేసేలా వ్యవహరిస్తుందని, దీన్ని పోరాటాలతో రక్షించుకుంటామనేందుకు సూచనగా ఇలా గొడుగులతో నిరసన ప్రదర్శన చేపట్టామని యుటిఎఫ్ నాయకులు పేర్కొన్నారు. అనంతరం ఉపాధ్యాయులను ఉద్దేశించి యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్.మురళీ మోహన్‌రావు మాట్లాడుతూ గుర్తింపు ఉపాధ్యాయ సంఘాలతో ప్రతివారం విద్యాశాఖ అధికారులు చర్చలు జరుపుతున్నారని, అయినా ఉపాధ్యాయుల్లో ఆందోళన కలిగిస్తున్న ప్రధాన సమస్యలపై విద్యాశాఖ అధికారులు స్పందించకుండా ఏకపక్షంగా చేపడుతున్న చర్యల వల్ల విద్యారంగం నష్టపోతుందని వివరించారు. గత ప్రభుత్వం 3, 4, 5 తరగతుల విలీనం, జిఒ 117 పేరుతో సర్దుబాటు ప్రక్రియ చేపట్టి ఉపాధ్యాయుల సంఖ్య తగ్గించి పనిభారం పెంచిందని పేర్కొన్నారు. దీనివల్ల 10 లక్షల మంది విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలల నుంచి తరలిపోయారని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ జిఒను రద్దు చేసి ప్రభుత్వ విద్యారంగాన్ని బలంగా తయారు చేస్తామని ప్రభుత్వం హామీ ఇచ్చిందని తెలిపారు. ఇచ్చిన హామీకి విరుద్ధంగా గత ప్రభుత్వ బాటలోనే ప్రయాణించడం విచారకరమన్నారు. యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.భాస్కరరావు మాట్లాడుతూ కొత్తగా 779 ప్రాథమికోన్నత పాఠశాలలను అప్‌గ్రేడ్ చేయడం, 9,652 మోడల్ ప్రైమరీ పాఠశాలల ఏర్పాటు చేయడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఉన్నత పాఠశాలల్లో 54మంది విద్యార్థులుంటేనే రెండో పోస్టు కేటాయిస్తామనే వైఖరి తీసుకోవడం వల్ల వేలాది పోస్టులు ఈ పాఠశాలల్లో మిగులు అవుతున్నాయని వివరించారు. మోడల్ ప్రైమరీ స్కూళ్లకు ప్రాధాన్యమిస్తూ ఫౌండేషన్, బేసిక్ ప్రైమరీ స్కూళ్లను నిర్వీర్యం చేస్తున్నారని, ఈ వైఖరి విద్యారంగానికి తీవ్ర నష్టం చేకూరుస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఉన్నత పాఠశాలల్లో 46 మంది విద్యార్థులుంటే రెండో సెక్షన్ ఏర్పాటు చేయాలని కోరారు. ఫౌండేషన్, బేసిక్ ప్రైమరీ స్కూల్స్‌లో 1:20 ప్రకారం ఉపాధ్యా యులను కేటాయించాలని కోరారు. ఏప్రిల్ నాటి రోల్ ఆధారంగా పోస్టుల కేటాయింపు చేయాలన్నారు. స్కూల్ అసిస్టెంట్లను యుపి, హైస్కూళ్లల్లోనే వినియోగించాలని సూచించారు. 2021 తర్వాత రెండుసార్లు రేషనలైజేషన్‌కు గురైన టీచర్లకు అదనపు పాయింట్లు కేటాయించి న్యాయం చేయాలని కోరారు. ఎస్‌జిటిలకు మాన్యువల్ కౌన్సెలింగ్ పద్ధతిలో బదిలీలు జరపాలని కోరారు. ఈ సమస్యలను పరిష్కరించకుంటే ఈనెల 15న వేలాది మంది ఉపాధ్యాయులతో పాఠశాల విద్యాశాఖ డైరెక్టరేట్ విద్యాభవన్ ముట్టడి స్తామని హెచ్చరించారు. ఆ పరిస్థితి రాకుండా విద్యాశాఖ మంత్రి, ఉన్నతాధికా రులు జోక్యం చేసుకుని సమస్యలు పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా కోశాధికారి కె మురళి, జిల్లా కార్యదర్శులు ఎన్.శ్రీనివాసరావు, ఎం.పైడిరాజు, బి.కూర్మారావు, బి.రామకృష్ణ, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పి.మధు అన్ని మండలాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

డిఇఒ కార్యాలయం వద్ద గొడుగులతో నిరసన తెలుపుతున్న యుటిఎఫ్ నాయకులు, ఉపాధ్యాయులు

వేతనదారులు కోరిన చోటే పని కల్పించాలి

ఎంపిడిఒ కార్యాలయంలో బైఠాయింపు

ప్రజాశక్తి - కురుపాం

ఉ పా ది. హామీ కూలీలు కోరిన చోటే పని కల్పిం చాలని సిపిఎం జిల్లా కార్యదర్శి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కొల్లి గంగు నాయుడు డిమాండ్ చేశారు. జియ్యమ్మవలసలో గత రెండు వారాలుగా ఉపాధి పనులు కల్పించక పోవడంతో సోమ వారం సిపిఎం, వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన ధర్నాలో గంగునాయుడు పాల్గొని మండల పరిషత్ కార్యాలయం వద్ద బైఠాయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఉపాధి కూలీలకు పనులు అడిగిన చోట ఇవ్వాలని, 14 రోజుల్లో బిల్లులు చెల్లించాలని స్పష్టమైన ఆదేశాలు ఇచ్చినప్పటికీ క్షేత్ర స్థాయికి వచ్చేసరికి అధికారులు మాత్రం కూలీలను ఇబ్బందులకు గురిచేస్తున్నారని, జియ్యమ్మవలసలో ఇప్పటికే 15 ఫారంపాండ్ పనులు చేశారని అన్నారు. మే నెలలో వేసవిలో ఫారం ఫాండ్ పనులు చేయలేమని, ఈ పనులు చేయించడానికి రైతులు ముందుకు రావడం లేదని ఉపాధి అధికారులకు చెబుతున్నప్పటికీ వారు వినకుండా గత రెండు వారాలుగా ఉపాధి కూలీలకు జియ్యమ్మవలసలో పనులు ఇవ్వలేదని అన్నారు. దీంతో కూలీలు అనేక ఇబ్బందులకు గురవుతున్నారని, గతవారం పని అడిగితే మేం ఇవ్వం... మీ దిక్కున చోట చెప్పుకోండి.. లేదా ఫిర్యాదు చేసుకోండని ఎంపిడిఒ, ఎపిఒ బాధ్యతారహితంగా సమాధానం చెప్పడం సమంజసం కాదని అన్నారు. ఇప్పటికైనా ఎంపిడిఒ, ఎపిఒ స్పందించి కూలీలు కోరిన చోట పనులు కల్పించాలని, లేనిచో మండలంలో ఉపాధి కూలీల అందర్నీ కదిలించి పెద్దఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి కె.సీతారాం, వ్యవసాయ కార్మిక సంఘం మండల అధ్యక్షులు బి.మోహనరావు, కూలీలు పాల్గొన్నారు.

ఎంపిడిఒ కార్యాలయాన్ని ముట్టడించిన ఉపాధి కూలీలు, వ్యకాస నాయకులు

ప్రతీ వారం పురోగతి కనిపించాలి : కలెక్టర్

ప్రజాశక్తి - పార్వతీపురం

ఉపాధి హామీ చట్టం ద్వారా జిల్లాలో చేపట్టే క్యాస్కేడింగ్, చెక్ డ్యాములు, కోకోనట్ ప్లాంటేషన్ పనుల్లో ప్రతి వారం పురోగతి కనిపించాలని కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ నీటిపారుదల శాఖ ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో సోమవారం నీటిపారుదల శాఖ ఇఇలు, డిఇఇలు, ఎఇఇలతో కలెక్టర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధి హామీలో క్యాస్కేడింగ్, చెక్ డ్యాములను నిర్మిస్తున్నామని, చెరువులను చెక్ డ్యాములకు అనుసంధానించడం ద్వారా నీటి వనరులు అందుబాటులో ఉంటాయని అన్నారు. చెరువులు, చెక్ డ్యాములకు సంబంధించిన పనులు వెంటనే ప్రారంభించాలన్నారు. జిల్లావ్యాప్తంగా 122 క్యాస్కేడింగ్ పనులతో పాటు చెక్ డ్యాములను మంజూరు చేసినప్పటికీ ఇంతవరకు పనులు ప్రారంభించకపోవడం పట్ల వివరాలు అడిగి తెలుసుకున్నారు. సర్పంచుల తీర్మానంతో స్థానిక ఎమ్మెల్యేలతో చర్చించి క్యాస్కేడింగ్, చెక్ డ్యాముల పనులు ప్రారంభించాలని తేల్చి చెప్పారు. ఎఇఇల వారీగా లక్ష్యాలను నిర్దేశించుకొని పనులు ప్రారంభమయ్యేలా చొరవ చూపాలని, ఇఇలు, డిఇఇలు సమన్వయం చేసుకోవాలని అన్నారు. ఇకపై ప్రతి సోమవారం వీటిపై సమీక్షిస్తానని, ఆలోగా ప్రగతి కనిపించాలని తెలిపారు. ప్రతివారం పురోగతి సాధించాలని, రానున్న ఆరు వారాల్లోగా పనులు పూర్తిచేయాలని ఇంజినీర్లను కలెక్టర్ ఆదేశించారు. ఇచ్చిన లక్ష్యాలను నాలుగు వారాల్లో పూర్తిచేసిన వారికి ప్రత్యేక ప్రోత్సాహక బహుమతిని ఇస్తామని కలెక్టర్ వివరించారు. ఈ ఏడాది నరేగాలో ఎకరాకు 60 కొబ్బరి మొక్కలు చొప్పున 5వేల ఎకరాల్లో కొబ్బరిని పెంచేందుకు ప్రణాళికను సిద్ధం చేయడం జరిగిందని, వాటికి సంబంధించి రిజర్వాయర్లు, ట్యాంకులను గుర్తించి కొబ్బరి ప్లాంటేషన్ జరిగేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. కార్యక్రమంలో డ్వామా పీడీ కె.రామచంద్రరావు, నీటిపారుదల శాఖ ఇఇ ఆర్.అప్పల నాయుడు, ఇతర ఇంజినీరింగ్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు ఉపయోగపడే పనులు చేయండి

జిల్లాలో ఉపాధి హామీ పథకం ద్వారా చేపడుతున్న పనులతో ప్రజలకు ఉపయోగం కలగాలని, ఆ దిశగా చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ ఎపిఒలకు దిశా నిర్దేశం చేశారు. తన కార్యాలయ సమావేశ మందిరంలో ఎపిఒలతో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఉపాధి హామీ పథకం కింద అనేక పనులను చేపట్టి గ్రామాలను అభివృద్ధి చేసుకోవచ్చని గుర్తుచేశారు. మొక్కుబడిగా ఉపాధి పనులు చేయకుండా ప్రజల అవసరాలను గుర్తించి, వారికి ఉపయోగపడే పనులపై దృష్టి సారించాలని అన్నారు. ఇందుకోసం నీటిపారుదల శాఖ డ్వామా ఇంజినీరింగ్ కన్సల్టెంట్లు, ఏపీఓలు సమన్వయం చేసుకొని నీటి సౌలభ్యం ఉన్న ప్రభుత్వ స్థలాలను గుర్తించాలని పేర్కొన్నారు. అలాగే ఫిష్ పాండ్స్, ఇతర కార్యక్రమాలను చేసుకోవచ్చని, వీటన్నింటిని ప్రజల్లోకి తీసుకువెళ్లి, వాటిని ఉపయో గించుకునేలా ఎపిఒలు శ్రద్ధ చూపాలని తెలిపారు.

తాగు నీటి పనులు పూర్తి చేయాలి

కాల పరిమితిలోగా తాగు నీటి పనులు పూర్తి చేయాలని కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ ఆదేశించారు. జిల్లాలో తాగు నీటి పరిస్థితిపై గ్రామీణ నీటి సరఫరా శాఖ ఇంజినీరింగ్ అధికారులు, ఎంపిడిఒలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. తాగు నీటి పనులకు లభ్యంగా ఉన్న నిధులను ఉపయోగించి తక్షణం పనులు పూర్తి చేసి తాగు నీరందించాలని ఆదేశించారు. వేసవి తీవ్రత ఎక్కువగా ఉన్నందున గ్రామాల్లో తాగు నీటి కొరత ఎక్కడా లేకుండా చూడాలని స్పష్టం చేశారు. కింద స్థాయి సిబ్బందితో ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ పరిస్థితులు తెలుసుకుని తక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. తాగునీటి పర్యవేక్షణ సెల్‌ను నిర్వహించాలని, ప్రజల నుంచి అందిన ఫిర్యాదులు నమోదు చేయాలని ఆదేశించారు. పాలకొండ పరిధిలో జన్‌మాన్ కింద 108 పనుల్లో 13 పనులు ప్రారంభమయ్యాయని గ్రామీణ నీటి సరఫరా డిఇ తెలిపారు. వీడియో కాన్ఫరెన్స్‌లో సంబంధిత అధికారులు, ఎంపిడిఒలు పాల్గొన్నారు.

మనుమకొండను ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దాలి

అశావాహ మండలం (ఆస్పిరేషనల్ బ్లాక్)లో భాగంగా భామిని మండలం మనుమకొండ గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దాలని కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ అధికారులను ఆదేశించారు. మనుమకొండ గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దడంపై సంబంధిత అధికారులతో కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. గ్రామం అన్ని రంగాల్లో ఉత్తమంగా నిలవాలని స్పష్టం చేశారు. అధునాతన యంత్ర పరికరాలు వివిధ రంగాల్లో ఉపయోగించేలా ప్రజలను తీర్చిదిద్దాలని సూచించారు. ప్రతి రంగంలో కనీసం 15 శాతం సుస్థిర అభివృద్ధి సాధించే లక్ష్యంగా పనిచేయాలన్నారు. వ్యవసాయ, ఉద్యాన, పశు సంవర్ధక, మత్స్య తదితర వ్యవసాయ అనుబంధ రంగాల్లో అధిక ఆదాయం పొందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రతి కుటుంబానికి ఆర్థిక సుస్థిరత రావాలని చెప్పారు. ప్రతి కుటుంబానికి రేషన్ కార్డు, వంట గ్యాస్, గృహం, ఎన్టీఆర్ వైద్య సేవ కార్డు, తాగు నీరు, విద్యుత్, మరుగుదొడ్లు కలిగి ఉండాలని, వాటి వినియోగం పట్ల స్పష్టమైన అవగాహన కలిగి ఉండాలని స్పష్టం చేశారు. గ్రామంలో ఫోన్, బ్రాడ్ బ్యాండ్, విద్యా సంస్థ, వైద్య సేవలు అందుబాటులో ఉండాలని పేర్కొన్నారు. వన్ ధన్ వికాస్, నైపుణ్య శిక్షణ కేంద్రాల వంటి ఏర్పాట్లు ఉండాలని తద్వారా స్థానికంగా లభించే పసుపు, చింతపండు, అడ్డాకులు తదితర ఉత్పత్తులకు విలువ ఆధారిత కల్పించడం, యువతకు పెద్ద ఎత్తున నైపుణ్యం కల్పించి స్వయం ఉపాధి దిశగా అడుగులు వేయించడం పట్ల దృష్టి సారించాలని తెలిపారు. గ్రామంలో ప్రతి ఒక్కరికీ ఆర్థిక అక్షరాస్యత ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. వీడియో కాన్ఫరెన్స్ లో సీతంపేట ఐటిడిఎ ప్రాజెక్టు అధికారి మరియు పాలకొండ సబ్ కలెక్టర్ సి యశ్వంత్ కుమార్ రెడ్డి, జిల్లా ప్రణాళిక అధికారి పి వీర రాజు, బ్లాక్ కోఆర్డినేటర్ మహేశ్వర రావు తదితరులు పాల్గొన్నారు.

సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలి

అఖిలపక్ష, కార్మిక సంఘాలు పిలుపు

ప్రజాశక్తి - పార్వతీపురం

ఈనెల 20న జరగనున్న సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని అఖిల పక్ష, ప్రజాసంఘాల నాయకులు పిలుపునిచ్చారు. సోమవారం స్థానిక సుందరయ్య భవనంలో నిర్వహించిన అఖిలపక్ష కార్మిక సంఘాల సమావేశంలో సిఐటియు, ఎఐటియుసి, ఐఎఫ్‌టియు, వ్యవసాయ కార్మిక సంఘం, రైతు సంఘం, రైతు కూలీ సంఘాల నాయకులు మాట్లాడుతూ కేంద్రంలో బిజెపి ప్రభుత్వం మూడోసారి అధికారం చేపట్టిన తర్వాత ప్రజాస్వామ్య హక్కులను హరించే విధానాలను అవలంబిస్తుందన్నారు. అందులో భాగంగానే 49 కార్మిక చట్టాలను రద్దు చేసి నాలుగు లేబర్ కోడ్లుగా రూపొందిస్తున్నారని విమర్శించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్పొరేట్ అనుకూల విధానాలను ప్రవేశపెట్టి రైతులు, గిరిజనులు, కార్మికులకు తీవ్ర నష్టం చేకూర్చే విధానాలను అవలంబిస్తున్నారని విమర్శించారు. దేశంలో రైతుల పండించే పంటలకు గిట్టుబాటు ధరల్లేవని, వ్యవసాయ కార్మికులకు, పారిశ్రామిక కార్మికులకు చేసేందుకు పూర్తి స్థాయిలో పనులు కల్పించడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వ పథకాలలో పనిచేస్తున్న కార్మికులకు, ఉద్యోగులకు కనీస వేతనాలు, ఉద్యోగ భద్రత కల్పించడం లేదన్నారు. అసంఘటిత రంగంలో పనిచేస్తున్న కార్మికులకు సమగ్ర చట్టం తెచ్చి వారి జీవనం మెరుగుపడేలా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈనెల 20న జరుగుతున్న సమ్మెలో ప్రజలు అధిక సంఖ్యలో భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు డి.రమనారావు, వై.మన్మధరావు, ఎఐటియుసి నాయకులు టి.జీవ, రైతు కూలీ సంఘం నాయకులు ఎం.భాస్కరరావు, పోల ఈశ్వరరావు, కృష్ణ, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు రెడ్డి ఈశ్వరరావు, సూరయ్య, కాంట్రాక్ట్ అవుట్సోర్సింగ్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ జిల్లా కన్వీనర్ బివి రమణ, శ్రామిక మహిళ నాయకులు వి.రామలక్ష్మి, అంగన్వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ అధ్యక్షులు జి.జ్యోతి, పట్టణ పౌర సంక్షేమ సంఘం నాయకులు బి.సూరిబాబు, మున్సిపల్ వర్కర్స్ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు ఎన్‌వై నాయుడు, భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు రాము, ఫీల్డ్ అసిస్టెంట్ సంఘం నాయకులు ఎం.హరనాథ్, ఆర్టీసీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ నాయకులు భాస్కరరావు పాల్గొన్నారు. అనంతరం సమ్మె ప్రచార గోడపత్రికలను అఖిలపక్ష కార్మికసంఘాల నాయకులు విడుదల చేశారు.

పాచిపెంట : మే 20న దేశవ్యాప్త సమ్మె జయప్రదం చేయాలని బిజెపి అనుసరిస్తున్న ప్రజా కార్మిక వ్యతిరేక విధానాలను నాలుగు లేబర్ కోడ్లు రద్దు చేయాలని స్థానిక ఆటో యూనియన్ అధ్యక్షులు కాద రాము పిలుపునిచ్చారు. ప్రధానంగా రవాణా రంగంపై బిజెపి ప్రభుత్వం చట్టాలు తీసుకొచ్చి డ్రైవర్ మెడకు ఉరితాడులా చట్టాలను తీసుకొచ్చిందన్నారు. ప్రమాదం జరిగితే డ్రైవర్‌కు అధిక జరిమానాలు, లైసెన్స్ రద్దు చేయడం జైలు శిక్ష వంటి చట్టాలను తీసుకొచ్చి కార్మికులకు జీవన ఉపాధి లేకుండా కుటుంబానికి నష్టం కలిగిస్తుందన్నారు. ఆటో డ్రైవర్లకు కేరళ తరహా సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని, నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని కోరుతూ ఈనెల 20న జరగబోయే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో పాల్గొని జయప్రదం చేయాలని కోరుతున్నాం

సమ్మె పోస్టర్‌ను ఆవిష్కఇరస్తున్న అఖిలపక్ష, కార్మిక సంఘాల నాయకులు

పిఎసిఎస్‌ల పటిష్టతకు చర్యలు

మంత్రి సంధ్యారాణి

ప్రజాశక్తి - సాలూరురూరల్

గ్రామీణ ప్రాంతాల్లో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల ద్వారా సన్న, చిన్నకారు రైతులకు పటిష్టమైన సేవలను అందుబాటులోకి తీసుకురావడానికి, సంఘాల ద్వారా అన్ని రకాల కార్యక్రమాలు నిర్వహించడానికి ప్రభుత్వం సిద్ధంగ ఆఉందని, దీన్ని ప్రతి రైతు ఉపయోగించుకోవాలని రాష్ట్ర స్త్రీ, శిశుసంక్షేమశాఖ, గిరిజన సంక్షేమశాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి తెలిపారు. మండలంలోని మామిడిపల్లిలో రూ.21లక్షలతో నిర్మించనున్న పిఎసిఎస్ భవన నిర్మాణానికి సోమవారం మంత్రి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ విత్తనాలు, పురుగుమందులను అందించడంతో పాటు ధాన్యం, మొక్కజొన్న పంటలను కొనుగోలు చేయడానికి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు ఎంతో కృషి చేస్తున్నాయని అన్నారు. ఇందు కోసం ప్రభుత్వం పటిష్టమైన చర్యలు తీసుకొనేందుకు సిద్ధంగా ఉందని, రైతులకు ఏ అవసరం ఉన్నా ఈ సంఘాలను ఉపయోగించుకోవాలని సూచించారు. గతంలో జరిగినట్టు అవకతవకలు లేకుండా ప్రతి ఒక్క రైతు తన భూమిని ఆధార్ కార్డుతో లింక్ చేసుకుంటే తనకి కావాల్సిన అప్పులను బ్యాంకు నుంచి డ్రా చేసుకొనేలా అన్ని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలను కంప్యూటరీకరణ జరిగిందని తెలిపారు. మామిడిపల్లి పిఎసిఎస్ ఏర్పడి సుమారు నాలుగు దశాబ్దాలు గడుస్తున్నా నేటికీ శాశ్వత భవనం లేకపోవడంతో రైతులు చాలా ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. దీన్నిగుర్తించే ప్రభుత్వం రూ.21 లక్షలు విడుదల చేసి కొత్త భవనాన్ని నిర్మించేందుకు సిద్ధమైందని, ఈ భవన నిర్మాణంతో ప్రైవేట్ బ్యాంకులతో పోటీగా సహకార సంఘం బ్యాంకు కూడా పనిచేస్తుందని, రైతులంతా దీన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు. మాజీ ఎమ్మెల్యే ఆర్ పి భంజ్ దేవ్ మాట్లాడుతూ మామిడిపల్లిలో వ్యవసాయ సహకార సంఘ భవనానికి తాడుతూరు తిరుపతిరావు లక్షల రూపాయల విలువైన స్థలాన్ని విరాళంగా ఇచ్చారని కొనియాడారు. గతంలో సొసైటీ బ్యాంకులంటే కేవలం కొందరు పెత్తందారులు అప్పులు వాడుకొని చలామణి అయ్యేవారని, ఇప్పుడు అటువంటి విధానాల్లేవని, ప్రతి బ్యాంకు కంప్యూటరీకరణ జరిగిందని, దీన్ని రైతులంతా ఉపయోగించుకోవాలని తెలిపారు. జిల్లా సహకార అధికారి శ్రీరామ్మూర్తి మాట్లాడుతూ ఈ ప్రాంతం గిరిజన ప్రాంతమైనందున ఇక్కడ గిరిజన రైతులకు డిపట్టా, కౌలు రైతులకు కూడా ఈ బ్యాంకు ద్వారా రుణాలు అందిస్తామని తెలిపారు. జిల్లాలో 45 ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు ఉన్నాయని, అందులో 15 సంఘాలకు శాశ్వత భవనాలు లేవని, వాటన్నింటికీ సొంత స్థలాలు సమకూర్చినట్లైతే శాశ్వతంగా భవనాలను నిర్మించడానికి అవకాశం ఉందని అన్నారు. ఒక్కొక్క భవన నిర్మాణానికి రూ.21 లక్షలు ప్రభుత్వం మంజూరు చేస్తుందని తెలిపారు. కార్యక్రమంలో సహకారశాఖ సబ్ డివిజనల్ అధికారి ఎన్ఎస్ఎస్ పద్మజ, జిల్లా మేనేజర్ కె.శంకరరావు, మామిడిపల్లి ఆఫీసియల్ పర్సన్ ఇన్‌ఛార్జి పి.జ్యోతి, ఎంపిడిఒ జి.పార్వతి, వైస్ ఎంపిపి సువ్వాడ గుణావతి, సర్పంచ్ సువ్వాడ శశికళ, స్థలదాతలు తాడుతూరి తిరుపతిరావు, రమణమ్మ, టిడిపి నాయకులు ఆమదాల పరమేష్, డొంకాడ అన్నపూర్ణ, బూస తవుడు, బ్యాంకు సిఇఒ విఘ్నేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

పిఎసిఎస్ భవనానికి శంకుస్థాపన చేస్తున్న మంత్రి సంధ్యారాణి

ముమ్మరంగా తనిఖీలు

ప్రజాశక్తి - గరుగుబిల్లి

మండలంలోని తోటపల్లి బ్యారేజి వద్ద దేశ సరిహద్దులో నెలకొన్న యుద్ధ వాతావరణం నేపథ్యంలో సోమవారం స్థానిక ఎస్ఐ రమేష్ నాయుడు ఆధ్వర్యంలో బాంబు డిస్పోజల్ టీం, డాగ్ స్క్వాడ్ తో వెళ్లి తోటపల్లి డ్యాం వద్ద ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఇందులో భాగంగా పేలుడు పదార్థాలు ఏమైనా ఉన్నాయా అని తనిఖీ చేశారు. అలాగే అనుమానస్పద వ్యక్తులు, ఎటువంటి అనుమానాస్పద వస్తువులు లభించలేదని తెలిపారు.

పిడుగుపాటుకు 11 గొర్రెలు మృతి

ప్రజాశక్తి - సీతానగరం

మండలంలోని సుభద్ర సీతారాంపురానికి చెందిన పి.నీలయ్యకు చెందిన 11 గొర్రెలు సోమవారం సాయంత్రం పిడుగుపడడంతో మృతి చెందిన సంఘటన చోటు చేసుకుంది. వివరాలకు వెళ్తే గొర్రెలను మేతల కోసం పొలానికి తోలుకెళ్లగా, సాయంత్రం వచ్చిన ఉరుములు, మెరుపులతో పిడుగుపాటుతో 11 గొర్రెలు మృతి చెందాయి. ఈ సుమారుగా రూ.లక్షా 50వేలు వరకు ఉంటాయని వారు చెబుతున్నారు. మృతి చెందిన గొర్రెలకు ప్రభుత్వం ఆర్థిక సహాయం అందించాలని కోరారు. గొర్రెలకు పోస్టుమార్టం నిమిత్తం పశువైద్యాధికారికి విషయం తెలియజేసినట్లు తెలిపారు.

సీతంపేటలో వడగల్ల వాన

సీతంపేట : మండలంలోని సోమవారం సాయంత్రం ఒక్కసారిగా మేఘం చిమ్మచీకటిగా మారి కారుమబ్బులతో ఈదురు గాలులతో వడగండ్ల వాన కురిసింది. భయంకరమైన పిడుగు శబ్దాలతో సీతంపేటలో కుండపోత వర్షం కురవడంతో ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. ఈ వర్షంతో ప్రజలకు కొంత ఉపశమనం కలిగింది.

పిడుగుపాటుకు గురై మృతి చెందిన గొర్రెలు

పనసభద్ర ఎంపిటిసి మృతి

మక్కువ : మండలంలోని పనసభద్ర ఎంపిటిసి సభ్యుడు సామంతుల వెంకటి సోమవారం మృతి చెందారు. గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. వెంకటి మృతి చెందిన వెంటనే మాజీ డిప్యూటీ సిఎం పీడిక రాజన్నదొర ఎర్ర సామంతవలసకు చేరుకుని నివాళులర్పించారు. స్థానిక జడ్పిటిసి సభ్యులు మావుడి శ్రీనివాసరావు, మండల వైసిపి అధ్యక్షులు రంగు నాయుడు, ఇతర పార్టీ శ్రేణులంతా వెంకటి భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించారు.

ఆత్మీయ కలయికలో మాట్లాడుతున్న ఉపాధ్యాయుడు సత్యనారాయణ

పూర్వ విద్యార్థుల అపూర్వ కలయిక

ప్రజాశక్తి-పాచిపెంట

పాచిపెంటలోని జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో 1989-90సంవత్సరంలో పదో తరగతి చదివిన విద్యార్థులంతా 35ఏళ్ల తరువాత సోమవారం అదే పాఠశాలలో కలుసుకున్నారు. గ్రామంలో జరుగుతున్న అమ్మవారి పండగ సందర్భంగా వీరంతా పాఠశాలలో కలుసుకున్నారు. ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకుని, పాత జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. తరగతి గదిలో సమావేశమై తమ కుటుంబం, పిల్లల చదువు తదితర విషయాలపై ఒకరికొకరు చర్చించుకున్నారు.

అంగన్వాడీల సమ్మె నోటీసు

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

తమ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ భద్రగిరి ఐసిడిఎస్ అంగన్వాడీ ఉద్యోగులు సోమవారం సమ్మె నోటీస్ ఇచ్చారు. ఈ సందర్భంగా అధ్యక్ష కార్యదర్శులు టి. సత్యవతి, వై. కస్తూరి మాట్లాడుతూ గత కొన్నేళ్లుగా అంగన్వాడీల సమస్యలను పరిష్కరించాలని ప్రభుత్వం దృష్టికి పలుమార్లు తీసుకొచ్చినా కనీసం పట్టించుకోవడం లేదన్నారు. అంగన్వాడీలకు ఉద్యోగ భద్రత కల్పించాలని, మెనూ చార్జీలు పెంచాలని, అదనంగా హెల్పర్ల నియామించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా వర్గ సభ్యులు మండంగి రమణ పాల్గొన్నారు.

అవగాహన తప్పనిసరి

ప్రజాశక్తి - కురుపాం

రహదారి భద్రత నియమాలపై వాహనాలు నడిపే ప్రతి ఒక్కరికీ అవగాహన తప్పనిసరిగా ఉండాలని నీలకంఠాపురం ఎస్ఐ నీలకంఠరావు అన్నారు. సోమవారం మండలంలో లంకజోడు గ్రామ ప్రధాన రహదారి వద్ద ప్రజలకు రహదారి భద్రత నియమాలు, సైబర్ క్రైమ్ నేరాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొబైల్ ఫోన్ వాడుతున్న ప్రతి ఒక్కరూ జాగ్రత్తగా ఉండాలని కొత్త కొత్త నెంబర్ నుంచి ఫోన్లు చేసి ప్రలోభాలకు గురి చేస్తుంటారని అటువంటి వాటికి నమ్మకుండా ఉండాలని, ద్విచక్ర వాహనం నడిపే ప్రతి ఒక్కరు హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని మద్యం సేవించకుండా రహదారి భద్రత నియమాలు పాటించి ధ్రువీకరణ పత్రాలు కలిగి ఉండి వాహనాలు నడపాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

మహాదేవి వలసలో వైద్య శిబిరం

ప్రజాశక్తి - వీరఘట్టం

మండలంలోని చలివేంద్రి సచివాలయం పరిధి మహాదేవివలసలో సోమవారం స్థానిక వైద్యాధికారి బి.ప్రదీప్ కుమార్ ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా జ్వర పీడితులు, గర్భిణీలు, బాలింతలు, రక్తపోటు, మధుమేహ, తదితర రకాలైన రోగులకు ప్రత్యేక వైద్య తనిఖీలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎఎన్ఎం, ఆశా కార్యకర్తలు ,104 సిబ్బంది, గ్రామస్తులు, పాల్గొన్నారు.

కార్యదర్శులకు ప్రమోషన్ ఇవ్వాలి

ప్రజాశక్తి - మక్కువ

పంచాయతీల పునర్వ్యవస్థీకరిస్తున్న నేపథ్యంలో గ్రేడ్ వారీగా కార్యదర్శులకు ప్రమోషన్లు కల్పించాలని స్థానిక ఇఒపిఆర్డి పి.దేవకుమార్‌కు మండల పంచాయతీ కార్యదర్శులు సోమవారం వినతి పత్రం అందజేశారు. అలాగే జిల్లా కలెక్టర్ డిప్యూటీ సిఎం, ముఖ్యమంత్రికి కూడా తెలపాలని ఈ సందర్భంగా వినతి పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో మండలంలోని కార్యదర్శులంతా పాల్గొన్నారు.

సోదరభావంతో ఆడాలి

ప్రజాశక్తి - కురుపాం

క్రీడల్లో గెలుపు, ఓటములు సహజమని, సోదర భావంతో ఆడాలని స్థానిక ఎమ్మెల్యే తోయిక జగదీశ్వరి అన్నారు. మండలంలోని ధర్మలక్ష్మీపురం గ్రామ యువత ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన మెగా క్రికెట్ టోర్నమెంట్‌ను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ క్రీడలు మానసిక ఆరోగ్యానికి, శారీరక దారుఢ్యానికి ఎంతో అవసరమని, క్రీడలతో పాటు ఉన్నత చదువులు చదివి ఉన్నత స్థానంలో స్థిరపడి తల్లిదండ్రులకు, గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని కోరారు. అనంతరం క్రికెట్ టోర్నమెంట్ నిర్వాహకులకు రూ.10వేలు ఆర్థిక సహాయం అందజేశారు. కార్యక్రమంలో నీలకంఠాపురం ఎస్ఐ నీలకంఠరావు, టిడిపి నాయకులు ప్రదీప్, శంకర్, లోవరాజు, దుర్గారావు, యువత పాల్గొన్నారు.

గిరిజన గ్రామాల్లో స్ప్రేయింగ్

ప్రజాశక్తి - సీతంపేట

మండలంలో సీతంపేట సచివాలయం దోనుబాయి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో ఉన్న పెద్ద గూడ, నాయుడు గూడ, లక్ష్మయ్యగూడ, దిశరగూడ గ్రామాల్లో సోమవారం స్ప్రేయింగ్ నిర్వహించారు. ఎంపిడిఒ బివి మిశ్రా, సర్పంచ్ కళావతి స్ప్రేయింగ్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ మాట్లాడుతూ ఇళ్లల్లో లోపల, బయట ఐఆర్ఎస్ ద్రావణం తప్పనిసరిగా స్ప్రేయింగ్ చేయాలన్నారు. మలేరియా సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో మలేరియా సబ్ యూనిట్ అధికారి జె మోహన్ రావు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఇన్‌ఛార్జి ఇఒపిఆర్‌డిగా కురిమినాయుడు

ప్రజాశక్తి - గరుగుబిల్లి

మండల ఇంఛార్జి ఇఒపిఆర్‌డిగా దళాయివలస గ్రామ పంచాయతీ కార్యదర్శి చింతల వెంకట కురిమినాయుడు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ప్రస్తుతం పని చేస్తున్న ఇఒపిఆర్‌డి ఎల్ గోపాలరావు సెలవుపై వెళ్లడంతో తాత్కాలిక ఇఒపిఆర్‌డిగా కురిమి నాయుడును నియమించినట్లు ఎంపిడిఒ జి.పైడితల్లి సోమవారం తెలిపారు. ఇంఛార్జి ఇఒపిఆర్‌డిగా బాధ్యతలు చేపట్టిన కురిమినాయుడు మాట్లాడుతూ గ్రామ పంచాయతీల్లో ప్రస్తుత వేసవి కాలంలో తాగునీటి ఎద్దడి లేకుండా ఉండేలా గ్రామ పంచాయతీ కార్యదర్శులు తగు చర్యలు చేపట్టాల్సి ఉందన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్యదర్శులు బంటు అప్పారావు, సూరు శ్రీనివాసరావు, జలగ వెంకటసాయికృష్ణ, నిరస రవికుమార్, తిరుపతి భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

పిల్లలకు ఖోఖో పోటీలు

ప్రజాశక్తి - పాచిపెంట

స్థానిక శాఖా గ్రంథాలయంలో వేసవి శిబిరంలో భాగంగా పిల్లలకు ఖో-ఖో పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో ఎక్కువ మంది పిల్లలు పాల్గొన్నట్టు ఇన్‌ఛార్జి గ్రంథాలయ అధికారి బబ్బురు గణేష్ బాబు తెలిపారు. కార్యక్రమంలో సహాయకుడు ఈశ్వర్ పాల్గొన్నారు.

గరుగుబిల్లి: స్థానిక శాఖా గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా సోమవారం విద్యార్థులకు క్విజ్, పాటల పోటీలు నిర్వహించారు. ఈ వేసవి శిక్షణ శిబిరానికి స్థానిక మండల పరిషత్ ప్రాథమిక ఉన్నత పాఠశాల, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలకు చెందిన విద్యార్థులు పాల్గొంటున్నారని గ్రంథాలయాధికారి నల్ల మధుసూదనరావు తెలిపారు. వేసవి శిక్షణ శిబిరంలో విద్యార్థులకు కథలు వినడం, పుస్తక పఠనం, పుస్తక సమీక్ష, ఆటల పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

ఖరీఫ్‌కు వ్యవసాయ శాఖ సిద్ధం

ప్రజాశక్తి - సీతానగరం

మండలంలో ఖరీఫ్-2025కు సంబంధించి ఎరువులు, వివిధ విత్తనాలు సిద్ధంగా ఉన్నాయని మండల వ్యవసాయ శాఖ అధికారి ఎస్.అవినాష్ తెలిపారు. ముందుగా అన్నదాత సుఖీభవ పథకంలో భాగంగా మండలంలోని నిడగల్లు, బూర్జలో రైతులకు రిజిస్ట్రేషన్ చేస్తున్న ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఖరీఫ్ పంట కాలానికి సంబంధించి రైతులు పచ్చిరొట్ట పంటలు వేసుకోవాలని వీటిని భూమిలో కలియదున్నడం వల్ల నేలకు పోషకాలు అందుతాయని, సేంద్రియ పదార్థం, నేల నిర్మాణం మెరుగుపడుతుందని అన్నారు. పచ్చి రొట్ట పంటలు వల్ల నేలసారం, పచ్చి రొట్ట పంటలు ముఖ్యంగా పప్పుజాతికి చెందినవి గాలిలోని నత్రజనిని నేలలో స్థిరీకరిస్తాయని తెలిపారు. అలాగే పచ్చి రొట్ట, కట్టె జనుము, పిల్లిపెసర విత్తనాలు అందుబాటులో ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ సిబ్బంది, రైతులు తదితరులు పాల్గొన్నారు.

చిత్తశుద్ధితో వినతులు పరిష్కరించాలి : కలెక్టర్

ప్రజాశక్తి - పార్వతీపురం

ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పిజిఆర్ఎస్) ద్వారా అందిన అర్జీలను చిత్తశుద్ధితో పరిష్కరించాలని కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ జిల్లా అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో పిజిఆర్ఎస్ కార్యక్రమం కలెక్టర్ అధ్యక్షతన సోమవారం జరిగింది. ఈ కార్యక్రమంలో 92మంది అర్జీదారుల నుంచి వినతులను కలెక్టర్ స్వీకరించగా, జాయింట్ కలెక్టర్ ఎస్ఎస్ శోబిక, ఐటిడిఎ పిఒ అశుతోష్ శ్రీవాస్తవ, డిఆర్ఒ కె.హేమలత, ఎస్డీసీ పి.ధర్మచంద్రారెడ్డి, డిఆర్‌డిఎ పీడీ ఎం.సుధారాణి భాగస్వామ్యమై వినతులను అందుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పిజిఆర్ఎస్‌లో వచ్చిన అర్జీలపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని, కావున అర్జీలను చిత్తశుద్ధితో త్వరితగతిన పరిష్కారం చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రతి అర్జీని క్షేత్రస్థాయిలో పారదర్శకంగా విచారణ జరిపి, నిర్ణీత గడువులోగా నాణ్యమైన పరిష్కారాన్ని అందించాలని స్పష్టం చేశారు. విజ్ఞప్తులను ప్రతి రోజూ గమనించి పరిష్కారం చూపాలని, నిర్లక్ష్యం వహిస్తే సహించబోమన్నారు. దిగువస్థాయి అధికారులకు అర్జీలను అప్పగించి, మొక్కుబడిగా పరిష్కారం చేస్తే ఉపేక్షించబోమని పేర్కొన్నారు. అలాగే సరైన పరిష్కారం చేయకుండా, అర్జీ మళ్లీ రీఓపెన్ అయ్యే పరిస్థితి తలెత్తరాదని అధికారులకు కలెక్టర్ తేల్చి చెప్పారు.

ప్రజల నుంచి అందిన విజ్ఞప్తులలో కొన్ని ఇలా...

జియ్యమ్మవలస మండలం డంగభద్ర నుంచి దొనక లక్ష్ముము అర్జీని అందిస్తూ, తన తండ్రికి ఇచ్చిన డి-పట్టా భూమి ఖాతా నెం. 241-64-2లోని ఆరు ఎకరాల్లో 38 సెంట్లు భూమి ఆక్రమణకు గురైందని, కావున తన భూమిని తనకు ఇప్పించాలని కోరారు. సాలూరు మండలం ఎంఎం గాదిపల్లి వలస నుంచి చొక్కాపు గంగులు దరఖాస్తును అందిస్తూ, తమ గ్రామంలోని సర్వే ఖాతా 240లో తన పేరున సంపూర్ణ హక్కులు కలిగిన భూమిని ఇతరులు విక్రయించారని, కావున దానిపై సమగ్ర విచారణ జరిపి తనకు న్యాయం చేయాలని తెలిపారు. పాలకొండ నగర పంచాయతీలో పొరుగు సేవలు కింద శానిటేషన్ వర్కర్ గా పనిచేస్తూ ఏసీబీ పట్టుబడి హైకోర్టులో కేసు ఉందని, కాని తుది తీర్పు రాకమునుపే, ఆ పోస్టును భర్తీచేస్తున్నారని, కావున తీర్పు వచ్చేంతవరకు దాన్ని నిలుపుదల చేయాలని పాలకొండ నుంచి కొనపల వీరభద్రరావు వినతిని అందజేశారు. గుమ్మలక్ష్మీపురం మండలం చిన్న రావికోన నుంచి తోయక జమ్మన్న పాములగిసాడ జంక్షన్ నుంచి చిన్న రావికోన వరకు తారు రోడ్డు వేయాలని కలెక్టర్ కు విజ్ఞప్తి చేశారు. బలిజిపేట మండలం పెద్దింపేటలో ఉపాధి పనులకు సంబంధించి సుమారు 200 మంది వేతనదారులకు జనవరి మూడో వారం నుంచి నేటి వరకు వేతనాలు చెల్లించలేదని, వాటిని మంజూరు చేయాలని ముదిలి జనార్దన్ కోరారు. తోణాం పంచాయతీలోని 16 గ్రామాలకు చెందిన జీడితోట రైతులకు రింగ్ ట్రెంచెస్, ఫారంపాండ్స్, డ్రాగన్ ఫ్రూట్ ఫలసాయం కొరకు ఉపాధి హామీ ద్వారా పనులు కల్పించాలని

మెట్టవలస నుంచి ఎం.భీమారావు, జీడి రైతులు వినతి పత్రాన్ని అందించారు. పార్వతీపురం మండలం డి.ములగ నుంచి చౌదరి రాణి వినతి పత్రాన్ని అందజేస్తూ, తాము పెయింటింగ్ చేసుకొని జీవనం సాగిస్తున్నామని తమకు ఆధార్, రేషన్ కార్డులు లేనందున వాటిని మంజూరు చేయాలని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా అధికారులు, ఇతర అధికారులు, అర్జీదారులు తదితరులు పాల్గొన్నారు.

ఐటిడిఎం గ్రీవెన్స్‌కు 22 వినతులు

సీతంపేట : స్థానిక ఐటిడిఎలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని ఐటిడిఎ పిఒ సి.యశ్వంత్ కుమార్‌రెడ్డి సోమవారం నిర్వహించారు. భామిని మండలం సన్నాయిగూడ గ్రామస్తులు వ్యవసాయ సాగు నిమిత్తం విద్యుత్ సౌకర్యం కోసం ట్రాన్స్‌ఫార్మర్ మంజూరు చేయాలని వినతి పత్రం సమర్పించారు. సీతంపేట మండలం టిటికుపాయి గూడ గ్రామానికి చెందిన ఆరిక శ్యామలరావు గ్రామానికి వరద గోడ మంజూరు చేయాలని, అదే మండలం మల్లి గ్రామానికి చెందిన సవర భూగన్న తాగునీటి సమస్య పరిష్కరించాలని, కుంబి గ్రామానికి చెందిన కూరంగి రామారావు అంగన్వాడి భవనం మంజూరు చేయాలని పిఒకు వినతి ఇచ్చారు. చాకలిగూడ గ్రామానికి చెందిన సవర సింహాచలం గృహ నిర్మాణ బిల్లు మంజూరు చేయాలని, సరుబుజ్జిలి మండలం బక్రీపేట గ్రామానికి చెందిన సవర సావిత్రి కుట్టుమిషన్ మంజూరు చేయాలని, హిరమండలం మండలానికి చెందిన గుడియపాడు గ్రామానికి చెందిన బిడ్డిక లచ్చయ్య వ్యవసాయం సాగు చేయడానికి బోరు మంజూరు చేయాలని, సీతంపేట మండలం గడిగుడ్డి గ్రామానికి చెందిన నిమ్మక లక్ష్మీ తనకు ఐదు నెలల జీతం ఇప్పించాలని, సోయలగూడ గ్రామానికి చెందిన సవర జమ్మురాజు కిడ్నీ వ్యాధితో బాధపడుతున్న తనకు తగిన వైద్యం ఇప్పించాలని, పొంజాడ గ్రామానికి చెందిన గేదెల కృష్ణవేణి తమకు హౌస్ హోల్డ్ మ్యాపింగ్ చేసి ఆరోగ్యశ్రీ కార్డు ఇప్పించాలని, ఈతమానుగూడ గ్రామానికి చెందిన సవర భారతి తమ గ్రామానికి రోడ్డు నిర్మాణం పూర్తిచేయాలని, నారాయణగూడ గ్రామానికి చెందిన సవర గణేష్ ఇల్లు నిర్మించడానికి పొజిషన్ సర్టిఫికెట్ ఇప్పించాలని, గజిలి గ్రామానికి చెందిన సవర బంగారయ్య నష్టపోయిన జీడి పంటకు నష్టపరిహారం ఇప్పించాలని వినతి పత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఐటిడిఎ ఎపిఒ జి.చిన్నబాబు, ఈఈ రమాదేవి, పిహెచ్ఒ వెంకట గణేష్, డిప్యూటీ డిఇఒ టి.చంద్రరావు, సిడిపిఒ రంగలక్ష్మి, ఎటిడబ్ల్యుఒ మంగ వేణి, వెలుగు ఎపిడి సన్యాసిరావు, ఉపాధిహామీ ఎపిడి శ్రీహరి, ఎఎంఒ కోటిబాబు ఇతర అధికారులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పిజిఆర్ఎస్‌కు 92 వినతులు

సీతంపేట: వినతులు స్వీకరిస్తున్న పిఒ యశ్వంత్‌కుమార్ రెడ్డి

ఫిర్యాదులపై సత్వర చర్యలు: ఎస్‌పి

పార్వతీపురం రూరల్: ప్రజా సమస్యల వేదిక ఫిర్యాదులపై పోలీసు అధికారులు స్పందించి తగు విచారణ వెంటనే జరిపి సత్వర చర్యలు చేపట్టాలని జిల్లా ఎస్‌పి ఎస్‌వి మాధవ్ రెడ్డి అన్నారు. సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ఫిర్యాదుదారుల నుండి అర్జీలను స్వీకరించి, అర్జీదారులతో ముఖాముఖి మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకొని, వారి ఫిర్యాదులను క్షుణ్ణంగా పరిశీలించారు. కుటుంబ కలహాలు, సైబర్ మోసాలు, తల్లిదండ్రులు వేధింపులు, భర్త, అత్తారింటి వేధింపులు, భూ- ఆస్థి వివాదాలు, నకిలీ పత్రాలు, అధిక వడ్డీలు, ఆన్‌లైన్ మోసం, ప్రేమ పేరుతో మోసం, ఇతర సమస్యలపై ఫిర్యాదుదారులు స్వేచ్ఛగా విన్నవించుకోగా, వారి సమస్యలపై సంబంధిత పోలీసు అధికారులతో స్వయంగా ఫోన్లో మాట్లాడి ఫిర్యాదు అంశాలను పరిశీలించి, వాటి పూర్వాపరాలను విచారణ చేసి, ఫిర్యాదు అంశాలు వాస్తవాలైనట్లయితే చట్ట పరిధిలో తక్షణ చర్యలు చేపట్టాలని, తీసుకున్న చర్యలకు సంబంధించిన నివేదికను జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయానికి పంపించాలని ఎస్‌పి అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మొత్తం 12 ఫిర్యాదులు అందాయి. ఈ కార్యక్రమంలో డిసిఆర్‌బి సిఐ ఆదాం, సిబ్బంది పాల్గొన్నారు.

పరిష్కార వేదికకు సమస్యలు నిల్

వీరఘట్టం: స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో సోమవారం ఎంపిడిఒ బి,వెంకటరమణ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రజల నుంచి ఏ ఒక్క సమస్య పైనా అర్జీ రాలేదని ఎంపిడిఒ తెలిపారు.

అంతర్రాష్ట్ర రహదారిపై గుంతలను పూడ్చండి

ప్రజాశక్తి - కొమరాడ

పార్వతీపురం నుండి కూనేరు వరకు మూడు రాష్ట్రాలకు వెళ్లే అంతర రాష్ట్ర రహదారి మార్గంలో ఏర్పడిన గుంతలను పూడ్చాలని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు కొల్లి సాంబమూర్తి డిమాండ్ చేశారు. రోడ్డుపై పలు ప్రాంతాల్లో ఏర్పడిన గోతులు కప్పాలని కోరుతూ తాహశీల్దార్ సాయి కామేశ్వరరావుకు సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సాంబమూర్తి మాట్లాడుతూ గత వైసిపి ప్రభుత్వంలో రోడ్ల పైన దృష్టి పెట్టకపోవడంతో పార్వతీపురం నుంచి కూనేరు మీదుగా మూడు రాష్ట్రాలకు వెళ్ళే రహదారి పెద్ద పెద్ద గుంతలు పడిందన్నారు. దీంతో వర్షాలు పడితే సుమారు ట్రాఫిక్ జామ్ అయ్యే పరిస్థితి ఉందన్నారు. కూటమి ప్రభుత్వంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు సంక్రాంతికల్లా అన్ని రహదారి మార్గాల్లో ఉన్న గోతులను కప్పి బయట గ్రామాలను నుండి వచ్చిన వారికి ఎటువంటి ఇబ్బంది కలగకుండా చేస్తామని చెప్పారని చెప్పినట్లే పెద్ద పెద్ద గోతులను పూడ్చారు తప్ప చిన్న చిన్న గోతులన్నీ వదిలేశారని గుర్తు చేశారు. ఇప్పుడు ఆ చిన్న గోతులన్నీ పెద్దవిగా మారి వర్షం పడితే చాలు ఆ గోతుల్లో నీరు చేరి అటు ఒరిస్సా ఇటు ఆంధ్రాకు వచ్చి వాహనదారులు, ప్రయాణికులు అనేక ప్రమాదాలకు గురయ్యే పరిస్థితి ఉందని అన్నారు. పార్వతీపురం నుంచి కుమ్మరకుంట రైల్వేగేట్ సమీపంలోనూ, జంఝావతి సెంటర్లోనూ, కోటిపాము బ్రిడ్జి వద్ద, కోటిపాము జెడ్‌పి హైస్కూల్ వద్ద, ఇందిరా నగరం గ్రామం వద్ద, సొళ్ల పదం దేవాలయం వద్ద ఏర్పడ్డ గోతులను పూడ్చాలన్నారు. ఈనెల 15వ తేదీ లోపు గాని ఈ మరమ్మతు పనులు చేపట్టకపోతే కోటిపాము బ్రిడ్జి వద్ద పెద్ద ఎత్తున ఆందోళన చేపడుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు సింహాచలం, మధు పాల్గొన్నారు.

సిపిఎం ఆధ్వర్యంలో తహశీల్దార్‌కు వినతి

తహశీల్దార్‌కు వినతి పత్రాన్నిస్తున్న సిపిఎం నాయకులు

'ఉపాధి'కి ఉపశమనం కరువు

ప్రజాశక్తి - వీరఘట్టం

మండలంలో 34 పంచాయతీల పరిధిలోని ఉపాధి పనులు జరిగిన చోట వేతనదారులకు ఉపశమనం కరువైంది. ఇంకుడు గుంతలు, పంట కాలువలు, చెరువు గర్భంలో మట్టి తొలగించడం, చెరువుల గట్టు పై మట్టి వేయడం, భూ అభివృద్ధి, మొక్కల చుట్టూ కందకాలు తవ్వడం వంటి పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. ప్రతిరోజు 8,232 మంది వేతనదారులు పనిలో పాల్గొంటున్నట్లు అధికారులు గణాంకాలు చెబుతున్నాయి. అయితే వీరు పని చేసే చోట కనీస మౌలిక సదుపాయాలు, మంచినీరు, టెంట్లు వంటి ప్రభుత్వం కల్పించకపోవడంతో వేతనదారులు మండుటెండలోనే పనిచేయవలసిన పరిస్థితి ఏర్పడుతుంది. పని జరిగిన చోట ఏ విధమైన సదుపాయం లేకపోవడంతో చెట్ల నీడను ఆశ్రయించి ఉపశమనం పొందుతున్నారు. రోజురోజుకు ఎండలు తీవ్రత అధికంగా ఉండుట వల్ల అవకాశం ఉన్న వేతనదారులు ముందస్తుగా గొడుగులు పట్టుకుని ఉపాధి పనులకు వెళుతున్నారు. అవకాశం లేని వారు చెట్లు నీడను ఆశ్రయించి కాలం గడుపుతున్నారు. ఈ విషయమే ఉపాధి ఎపిఒ జి.సత్యంనాయుడు వద్ద సోమవారం ప్రజాశక్తి ప్రస్తావించగా ప్రభుత్వం నుంచి ఏ విధమైన ఆదేశాలు రాలేదని, వేతనదారులకు మాత్రం వైద్య సిబ్బంది ద్వారా ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందజేస్తున్నారని ఆయన వివరణ ఇచ్చారు.

చెట్టు నీడన సేదతీరుతున్న వేతనదారులు

ధర్నా చేస్తున్న బాధితులు, నాయకులు

నిర్వాసితుల పట్ల నిర్లక్ష్యం వీడాలి

ప్రజాశక్తి - పార్వతీపురం రూరల్

ఏళ్లు గడుస్తున్నా తోటపల్లి నిర్వాసితుల సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యం ప్రదర్శిస్తుందని, తక్షణమే వారి సమస్యలను పరిష్కరించాలని ప్రాజెక్టుల నిర్వాసిత సంఘం రాష్ట్ర కార్యదర్శి బంటు దాసు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం నిర్వాసితులతో కలసి జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి కార్యాలయంలో వినతి అందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పార్వతీపురం మండలంలోని తోటపల్లి, పిన్నింటి రామి నాయుడవలసకు చెందిన నిర్వాసితులకు ఆర్అండ్ఆర్ ప్యాకేజీ కింద ఇళ్లునిర్మించుకున్నప్పటికీ ఇంతవరకు సదరు ఇళ్లకు బిల్లులు మంజూరు కాలేదన్నారు. గ్రామంలో మొత్తం 68 మంది నిర్వాసితులకు గాను కేవలం 12 మందికి మాత్రమే కొద్ది మొత్తంలో చెల్లింపులు జరిగాయని, ఇంకా 56 మంది నిర్వాసితులకు పూర్తిగా చెల్లింపులు చేయాల్సి ఉందన్నారు. అధికారులు నిర్లక్ష్యం వీడి నిర్వాసితుల ఆర్థిక ఇబ్బందులను గమనించి ఎస్ఎస్ఆర్ రేట్ల ప్రకారం ఒక్కొక్కరికి రూ.5 లక్షలు చొప్పున బిల్లులు చెల్లించాలని కోరారు.

సాగునీటి కాలువల్లో సిల్ట్ తొలగించండి

ప్రజాశక్తి - పార్వతీపురం రూరల్

జిల్లాలో గల సాగునీటి కాలువల్లో సిల్ట్ తొలగింపు చర్యలు చేపట్టాలని కాంగ్రెస్ ఒబిసి జిల్లా చైర్మన్ వంగల దాలినాయుడు కోరారు. సోమవారం కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో ఆయన పార్వతీపురం సబ్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవతో జిల్లాలోని సాగునీటి కాలువల దుస్థితిపై చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాగునీటి కాలువల్లో సిల్టు పేరుకుపోయి, పిచ్చి మొక్కలు, తుప్పలు, చెట్లతో నిండిపోయి ఉందని, రానున్న ఖరీఫ్ సీజన్లో నీటి ప్రవాహం ఇబ్బందిగా ఉంటుందని, ఆఖరు పొలాలకు నీరందే పరిస్థితి ఉండదని పలువురు రైతులు తమ దృష్టికి తీసుకువచ్చారన్నారు. ఈ విషయమై తాము పలు సాగునీటి కాలువలను పరిశీలించామని చెప్పారు. జిల్లాలో తాగునీటి కాలువల పరిస్థితి దయనీయంగా ఉందన్నారు. జంఝావతి, తోటపల్లి కుడి, ఎడమ (బ్రిటీష్) కాలువలు, పెదంకలాం అక్విడెడ్ కాలువలు, రావడగెడ్డ కాలువలు, వరహాలగెడ్డ తదితర సాగునీటి కాలువల్లో పూడుకలు పేరుకుపోయి, వివిధ రకాల జంగిల్స్‌తో నిండి పోయాయన్నారు. దీంతో నీటి ప్రవాహం కష్ట సాధ్యమవుతుందన్నారు. కొత్తవలస ఆనకట్ట, సాకి గెడ్డ తూముల వద్ద పెద్దపెద్ద చెట్లు చెత్తా, చెదారం ఇరుక్కుపోయి నీటి ప్రవాహానికి ఆటంకం కలుగుతుందన్నారు. పలుచోట్ల షట్టర్లు, మధుములు మరమ్మతులకు గురయ్యాయన్నారు. ఖరీఫ్ సీజన్‌కు ముందే సాగునీటి కాలువల్లో సిల్ట్ తొలగింపు, జంగిల్ క్లియరెన్స్ చర్యలు చేపట్టాలన్నారు. షట్టర్లు, మధుములకు మరమ్మత్తులు చేపట్టాలన్నారు. పార్వతీపురంలోని వరహాల గెడ్డలో వర్షాకాలానికి ముందే పూడికతీత పనులు చేపట్టి, లోతట్టు ప్రాంతాలు ముంపుకు గురికాకుండా చర్యలు చేపట్టాలన్నారు. అనంతరం వినతిపత్రాన్ని అందజేశారు. దీనికి స్పందించిన సబ్ కలెక్టర్, తక్షణమే చర్యలు చేపట్టాలని ఇరిగేషన్, డ్వామా, మున్సిపల్ అధికారులను ఆదేశించారు.

సబ్ కలెక్టర్‌కు సమస్యను వివరిస్తున్న కాంగ్రెస్ నాయకులు

జంఝావతి కాలువల్లో పూడికలు తొలగించాలి

ప్రజాశక్తి -గరుగుబిల్లి

మండల పరిధిలోని కొంకడివరం గ్రామం వద్ద జంఝావతి కాలువలో పూడికలు, తుప్పలు, డొంకలు తొలగించి పూర్తిస్థాయిలో సాగునీరు అందించాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బుడితి అప్పలనాయుడు డిమాండ్ చేశారు. ఈ మేరకు కొంకడివరం గ్రామానికి చెందిన రైతులతో కలిసి జంఝావతి కాలువను సోమవారం పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గడిచిన ఐదు సంవత్సరాల నుంచి కాలువలో పూడికలు, తుప్పలు డొంకలను తొలగించకపోవడంతో పూర్తిగా సాగునీరు అందక వర్షాధారం మీద ఆధారపడి పంటలు పండిస్తున్న రైతులు తీవ్ర ఇబ్బందులకు గురవు తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో కొంకడివరం సర్పంచ్ అల్లు అప్పలనాయుడు, వాలేటి జనార్ధన నాయుడు, అల్లు సూర్యనారాయణ, మూడడ్ల వెంకటనాయుడు, వెలగాడ పైడితల్లి, రెడ్డి కృష్ణంనాయుడు, చల్లారపు రమేష్, ప్రజా సంఘాల నాయకులు తోట జీవ, గరుగుబిల్లి సూరయ్య తదితరులు పాల్గొన్నారు.

జిపిఎల్ విజేత బత్తిలి

ప్రజాశక్తి - భామిని

మండలంలోని గజపతినగరంలో గజపతినగరం క్రికెట్ యూత్ ఆధ్వర్యంలో నిర్వహించిన గజపతినగరం ప్రీమియర్ లీగ్ టోర్నమెంట్‌లో బత్తిలి జట్టు సోమవారం విజేతగా నిలిచింది. 15 రోజులు 23 టీమ్‌లతో నిర్వహించిన ఈ టోర్నమెంట్‌లో బత్తిలి, బాలేరు జట్లు ఫైనల్‌కు చేరుకుని తలబడ్డాయి. మొదటగా బ్యాటింగ్ చేసిన బత్తిలి జట్టు 12 ఓవర్లలో 128 పరుగులు చేసింది. రెండవ ఇన్నింగ్‌లో బాలేరు జట్టు 12 ఓవర్లలో 111 పరుగులు చేసి ఓటమి పాలైంది. విజేతగా నిలిచిన బత్తిలి జట్టు కెప్టెన్ లింగరాజుకు రూ. 15వేలు ప్రైజ్ మని, ట్రోఫిని బత్తిలి ట్రైనీ ఎస్ఐ రెడ్డి, ఎఎస్ఐ కాంతారావు అందజేశారు. రన్నర్‌గా నిలిచిన బాలేరు జట్టు కెప్టెన్ డి.దినేష్‌కు రూ.8వేలు ప్రైజ్‌మని, ట్రోఫీ అందజేశారు. టోర్నమెంట్ బెస్ట్ బ్యాట్స్ మాన్ అయినా దినేష్‌కు సీల్డ్ అందజేశారు. కార్యక్రమంలో టోర్నమెంట్ నిర్వాహకులు కద్రక గణేష్, కె. ఢిల్లీ, కె. శ్రీహరి, ఏ.శివాజీ, పి.తరుణ్ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగ నియామకాలపై విచారణ చేపట్టాలి

ప్రజాశక్తి - పాలకొండ

స్థానిక నగర పంచాయతీలో అక్రమంగా అవుట్ సోర్సింగ్ ఉద్యోగ నియామకాలపై విచారణ జరిపి అవినీతికి పాల్పడుతున్న అధికారులపై చర్యలు తీసుకోవాలని పాలకొండ సబ్ కలెక్టర్ యశ్వంత్ కుమార్ రెడ్డిను సామాజికవేత్త దుంపల చిన్ని కోరారు. స్పందించిన సబ్ కలెక్టర్ సమగ్రమైన విచారణ జరిపి చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు

నేరాలు ఘోరాలు

ఉరేసుకుని ఆత్మహత్యచేసుకున్న దినేష్

తల్లి డబ్బులు ఇవ్వలేదని.. ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య

ప్రజాశక్తి - సాలూరు

పట్టణానికి చెందిన గంట దినేష్ (29) ఫ్యాన్‌కు ఉరేసుకుని సోమవారం ఆత్మహత్య చేసుకున్నాడు. తాగుడకు బానిసైన దినేష్ తనతల్లిని మద్యం తాగడానికి డబ్బులు అడిగాడు. ఆమె నిరాకరించడంతో తీవ్ర మనస్థాపనకు గురై ఫ్యాన్‌కు ఉరివేసుకొని ఆత్మ చేసుకున్నాడు. స్థానిక పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సాలూరు పట్టణంలో డబ్బివీధికి చెందిన దినేష్ లారీ క్లీనర్‌గా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. మద్యానికి బానిసై తాగేందుకు తల్లిని డబ్బులు అడిగాడు. కూలి పని చేసుకుంటున్న తల్లి తన వద్ద డబ్బులు లేవని చెప్పడంతో తీవ్ర మనస్థాపానికి గురై ఎవరూ లేని సమయంలో తన ఇంట్లో ఉన్న సీలింగ్ ఫ్యాన్‌కు ఉరి వేసుకొని ఉదయం ఆత్మహత్య చేసుకున్నాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సాలూరు ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సాలూరు పట్టణ ఎస్ఐ తెలిపారు

మద్యం తయారీ కేంద్రాలపై దాడులు

ప్రజాశక్తి - పార్వతీపురం

జిల్లాలో అక్రమ మద్యం తయారీ కేంద్రాలపై అంతర్రాష్ట్ర సమన్వయంతో పెద్ద ఎత్తున దాడి నిర్వహించినట్లు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఆఫీసర్ బి.శ్రీనాథుడు తెలిపారు. అక్రమ మద్యం తయారీకి వ్యతిరేకంగా నిరంతరం చర్యలు తీసుకుంటున్న ఎక్సైజ్ శాఖ, ఒడిశా ఎక్సైజ్ అధికారులతో కలిసి సోమవారం ఒడిషాలోని రాయగడజిల్లా గుణుపూర్ బ్లాక్‌లోని కొత్తగూడ, కంగమానుగూడ, సరిహద్దు వెంబడి ఉన్న చీడివలస, కర్లి గ్రామాల అటవీ ప్రాంతాల్లోని అధిక సాంద్రత కలిగిన అక్రమ మద్యం తయారీ మండలాలపై పెద్దఎత్తున దాడి చేసినట్లు చెప్పారు. ఈ దాడిలో 23వేల లీటర్ల పులియబెట్టిన బెల్లం ఊట (అక్రమ మద్యం తయారీలో ముడిసరుకుగా ఉపయోగించేది)ను స్వాధీనం చేసుకొని, అక్కడికక్కడే ధ్వంసం చేసినట్లు చెప్పారు. అలాగే 440 లీటర్ల ఐడీ (ఇలిసిట్లీ డిస్టిల్డ్) మద్యాన్ని పట్టుకొని ధ్వంసం చేశామని పేర్కొన్నారు. ఇద్దరిపై రెండు కేసులు నమోదు చేశామని, పలువురు అనుమానితులను కూడా ఈ దాడిలో గుర్తించినట్టు తెలిపారు. ఆంధ్రా - ఒడిశా సరిహద్దు ప్రాంతాల్లో అక్రమ మద్యం తయారీ, స్మగ్లింగ్‌ను అరికట్టడానికి ఉద్దేశించిన విజయవంతమైన ఈ ఉమ్మడి ఆపరేషన్‌లో ఆంధ్రా, ఒడిశా రెండు రాష్ట్రాల ఎక్సైజ్ శాఖలు సమన్వయంతో దాడులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సమన్వయ ఆపరేషన్‌లో రాష్ట్రానికి చెందిన 38 మంది, ఒడిశా రాష్ట్రం నుంచి 12 మంది ఎక్సైజ్ అధికారులు పాల్గొన్నట్లు పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

ప్రజాశక్తి- పాచిపెంట

రోడ్డు ప్రమాదంలో గిరిజన యువకుడు మృతి చెందిన సంఘటన మండలంలోని పి.కోనవలస కళాశాల ముందు మలుపు వద్ద ఆదివారం రాత్రి జరిగింది. ఈ ప్రమాదంలో మండలంలోని బడ్నాయికవలసకు చెందిన బోయిన లక్ష్మణరావు(31) మృతి చెందాడు. పోలీసులు కథనం ప్రకారం.. లక్ష్మణరావు మద్యానికి బానిసవడంతో నిత్యం భార్య భర్తల మధ్య గొడవలు జరుగుతున్నాయి. ఆదివారం కూడా గొడవ జరగడంతో భార్య మనస్థాపంతో గుర్తుతెలియని మాత్రలు మింగేసింది. వెంటనే గుర్తించిన లక్ష్మణరావు భార్యను చికిత్స నిమిత్తం సాలూరు ఆస్పత్రికి తరలించారు. ఇంటికి వచ్చిన లక్ష్మణరావు తిరిగి ఆస్పత్రిలో ఉన్న తన భార్యను చూసేందుకు ద్విచక్ర వాహనంపై ఆదివారం రాత్రి బయలు దేరాడు. పి. కోనవలస కళాశాల సమీపంలో మలుపు వద్దకు వచ్చేసరికి బండి అదుపు తప్పి పక్కనే ఉన్న స్తంభాన్ని బలంగా ఢీకొట్టాడు. తీవ్రంగా గాయపడిన లక్ష్మణరావును సాలూరు ఆస్పత్రికి అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం విజయనగరం ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ లక్ష్మణరావు మృతి చెందాడు. స్థానిక ఎస్ఐ వెంకటసురేష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.